
ప్రజాశక్తి

సోమవారం 11 ఆగస్టు 2025



ఆంధ్రా-ఒడిశా చెక్‌పోస్టు వద్ద గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొమరాడ

ఒడిశా నుంచి ఆంధ్రాలోకి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎఒబి సరిహద్దు ప్రాంతమైన కూనేరు చెక్ పోస్ట్ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. ఆదివారం కూనేరు చెక్ పోస్ట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కూనేరు వద్ద వాహన తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో రాయగడ నుండి పార్వతీపురం వైపు వెళ్తు ఆటోలో ఇద్దరు వ్యక్తులు 14 కేజీల 890 గ్రాముల గంజాయిని రెండు బ్యాగులతో ఉండటం గుర్తించామని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా ఒకరు బీహార్‌కు చెందిన వారు కాగా, మరో మహిళ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వ్యక్తి గా గుర్తించామని తెలిపారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో కొమరాడ తహాశీల్దార్ సిహెచ్. సత్యనారాయణ, ఎంపిడిఒ ఎస్.రమేష్, పోలీసులు ఉన్నారు.

మొదలైన సాగునీటి కష్టాలు

- ఎండుతున్న ఎదలు • మోటార్ల సాయంతో సాగు
- కాలువల ద్వారా అందని నీరు
- ఇదీ మండలంలోని అన్నదాతల దుస్థితి

నిన్న, మొన్నటి వరకు విత్తనాలు, ఎరువులు కోసం అష్ట కష్టాలు పడి చివరికి విత్తనాలు చల్లినప్పటికీ కాలువల ద్వారా చుక్క నీరు రాకపోవడంతో సాగునీటి కోసం అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు రైతును రాజును చేస్తామని చెప్పిన మాటలు హామీలకే పరిమితమయ్యాయి తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. సకాలంలో వర్షాలు పడక, కాలువల ద్వారా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కురిసిన వర్షాలకు, మోటార్లతో తోడిన నీటితో కొన్ని చోట్ల ఎదలు చల్లారు. గత రెండు మూడు వారాలుగా వర్షాలు పడకపోవడంతో ఎదలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కాలువలు ద్వారా కూడా సాగునీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ, పివిఆర్‌పురం, చిదిమీ, డిపివలస, చేబియ్యంవలస, బిటివాడ, తదితర గ్రామాలకు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ పిల్ల కాలువల ద్వారా ఇప్పటికీ సాగునీరు అందకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నెల రెండో వారం వచ్చినప్పటికీ కాలువలు ద్వారా సాగునీరు అందించకపోవడంతో పచ్చగా కనిపించవలసిన పంట పొలాలు బీడు భూములుగా దర్శనం ఇవ్వడంతో సాగునీటి కోసం అన్నదాతలు కంటతడి పెడుతున్నారు.



తూడిలో ఎండిన ఎదలు

పేరుకే కాలువ

ఏడవ బ్రాంచ్ తూడి గ్రామం మీదుగా డిపివలస గ్రామానికి సాగునీరు రావాల్సి ఉంది. చివరి ప్రాంతం కావడంతో తూడి గ్రామానికి సక్రంగా సాగునీరు రావటం లేదు. మా గ్రామానికి వచ్చే పరిస్థితి లేదు. వర్షం కరుణిస్తే కొండ నుంచి వచ్చే వరద నేరుగా మా పొలాలకు వస్తుంది. చెప్పుకోడానికి పిల్ల కాలువ తప్ప చుక్క సాగునీరు కూడా రావటం లేదు.

పి.నారాయణ రావు,
రైతు, డిపి వలస

మోటారు సాయంతో పంటలు

తోటపల్లి ప్రథమ ఎడమ కాలువ పరిధిలోని 1వ బ్రాంచి కాలువ నుండి చివరి ప్రాంతం కావడంతో సాగునీరు రావటం లేదు. పూర్తిగా వీటిపై ఆశలు వదులుకొని, మోటార్ల సహాయంతోనే ప్రతి ఏడాది పంటలు సాగు చేస్తున్నాం.

ఎం.గొల్ల బాబు,
రైతు, గడగమ్మ

కరుణించని వరుణుడు

కనీసం చినుకు కూడా పడకపోవడంతో ఎండల తీవ్రత వల్ల చల్లిన ఎదలు ఎండుతున్నట్లు అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి ప్రధాన కాలువ ఉందని చెప్పుకోవడమే తప్ప కనీసం వాటి ద్వారా చుక్కనీరు రావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటార్ల సహాయంతో పంటల సాగు

మండలంలోని గడగమ్మ, పివిఆర్‌పురం, నడుకూరు, చిదిమి తదితర గ్రామాలకు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ మొదటి కాలువ, ఆరవ బ్రాంచి, 7వ బ్రాంచీల ద్వారా గ్రామాలకు సాగునీరు రావాల్సి ఉన్నప్పటికీ గ్రామాలకు క్రమంగా సాగునీరు రాకపోవడంతో పివిఆర్ పురం గ్రామానికి చెందిన తోలాపు శ్రీను, విశ్వనాథం, ఆవాల పోలినాయుడు, బి,అప్పలనాయుడు, ఉదయాన జగన్మోహన రావు, మజ్జి అప్పలనాయుడు, తదితర అన్నదాతలతో పాటు గడగమ్మ గ్రామానికి చెందిన మజ్జి గొల్లబాబు, పైడిప్పు నాయుడు, బూరుగ విశ్వేశ్వరరావు, మజ్జి ఫకీర్‌నాయుడు, గుడివాడ జోగినాయుడు, ఖాతా కృష్ణమూర్తి, జి.రామినాయుడు, రఘు మండల సింహాచలం, ఎల్.బాబురావు, రఘుమండల నారాయణమ్మ, ఉమామహేశ్వర రావు, రెడ్డి పైడినాయుడు, రెడ్డి చంద్ర నాయుడు, సింహాచలం, ఏ సంగయ్య, బుజ్జి, పి తవుడు, ఏ వెంకయ్య, ఆర్ కైలాసరావు, తిరుపతిరావు, జోగి నాయుడు, ఎ. రాజు తదితర రైతులు మోటార్ల సహాయంతోనే ఈ ఏడాది పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. గత పదేళ్ల నుంచి నుండి గడగమ్మ గ్రామానికి కాలువ ద్వారా సాగునీరు రావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

కాలువలో పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి చివర ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించి తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడిచిపెట్టకముందే పిల్ల కాలువలోనే జెసిబి ద్వారా మట్టిని తొలగించాం.

డి.వెంకటరమణ,
ఇరిగేషన్ ఎఇఇ, వీరఘట్టం



డిపివలస వద్ద సాగునీరు లేక బోసిపోయిన తోటపల్లి పిల్ల కాలువ



మహాసభలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ఎండిఎం ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి డిమాండ్
- సంఘం పార్వతీపురం మన్యం జిల్లా రెండో మహాసభలోనూ తీర్మానం
- నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జి.తులసి, వై.శాంతికుమారి ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైన తర్వాత స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరగడమేగాక, బడి మానేసే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గినట్టు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి అన్నారు. ఆదివారం ఎపి మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా రెండో మహాసభ స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. మొదటగా యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.తులసి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం తులసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.శాంతకుమారి గత మూడేళ్లలో సంఘ నిర్మాణం, పోరాటాల, కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జి.వరలక్ష్మి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని అనేక ప్రాంతాల్లో ప్రైవేట్ సంస్థలకు అప్పగించే కుట్రలు పన్నుతుందన్నారు. దేశంలో 25 లక్షల మంది, రాష్ట్రంలో 85వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని, దేశంలోని 12 కోట్ల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం సిద్ధం చేసి దేశ భవిష్యత్తును సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకుల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలే ఎక్కువగా ఉన్నారని, వీరిలో అధిక శాతం వితంతువులు, ఒంటరి మహిళలలేనన్నారు. మహిళ సాధికారత కల్పిస్తామని జపంచేస్తున్న కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాన్ని పెంచకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.సుధారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ. 600, రాష్ట్ర ప్రభుత్వం రూ.400 వేతనం ఇస్తున్నారని, రాష్ట్రంలో మన యూనియన్ పోరాట ఫలితంగా మరో రూ.2000 వేతనం అదనంగా సాధించుకున్నామని అన్నారు. ప్రధానమంత్రి పోషణ్ యోజనం, రాష్ట్రంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్చినప్పటికీ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయని వివరించారు. ఈ పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకూడదని, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్లు తీసుకురావడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మెనూఛార్జీలు, కార్మికులకు వేతనాలు పెంచాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, మెనూ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం-2020 రద్దు చేయాలని, కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించకూడదని డిమాండ్ చేశారు. తొలగించబడిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వంట సమయంలో అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం 20 లక్షల రూపాయలు చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రతీ నెల వేతనాలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులతో వర్కర్ల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.రామలక్ష్మి, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా వ్యాప్తంగా గల అన్ని మండలాల నుంచి మధ్యాహ్నం భోజనం కార్మికులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

జిల్లా నూతన అధ్యక్షులు జి.తులసి, ప్రధాన కార్యదర్శి వై.శాంతికుమారి, కోశాధికారి కె.మీనాకుమారి, జిల్లా కమిటీ సభ్యులుగా యు.లక్ష్మి, కె.ఉష, పావని, కళ్యాణి, సుశీల, గౌరమ్మ, రజిని, సావిత్రమ్మ, షబానాను ఎన్నుకున్నారు.



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం



కోతకు గురైన వంభరెల్లి రహదారి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కొత్తగూడ పంచాయతీ వంబరెల్లి గిరిజన గ్రామాలకు వెళ్లి రోడ్ పరిస్థితి అధ్వానంగా ఉందని గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతరావు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పనులను మూడేళ్ల నుంచి సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి చేయలేదని, అయినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. బంగారు కుటుంబం అని కూటమి నాయకులు గొప్పలు చెప్తున్నారని, ముందు రోడ్లు బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యలపై పోరాటమే యుటిఎఫ్ ధ్యేయం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటమే ధ్యేయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు చెప్పారు. యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 52ఏళ్లుగా యుటిఎఫ్ ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. యుటిఎఫ్ జెండా కింద ఉన్న ఉపాధ్యాయులకు మెరుగైన ఆర్థిక, సామాజిక స్థాయి సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యారంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటుందని, ఉపాధ్యాయులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, గోవిందమ్మ, మండల నాయకులు జగన్నాథం, పోలినాయుడు, టి.శ్రీను, హేమ సుందర్ పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక కోమటి వీధి మోడల్ ప్రైమరీ పాఠశాల ఆవరణలో ఆదివారం యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు, గౌరవాధ్యక్షులు ఎ.స్వామిబాబు యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, ఎం.ముకుందరావు, ఎ.చంద్రమౌళి, కె. గోవిందరావు, తదితరులు, పాల్గొన్నారు.



పార్వతీపురంలో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్, నాయకులు

ప్రజాదర్బారా? మొక్కుబడి 'షో'నా?

- జవాబుదారీతనం లేని ప్రజాప్రతినిధుల కార్యక్రమాలు
- వారం వారం గ్రీవెన్స్ సెల్‌కూ ఫిర్యాదులు కుప్పలుతెప్పలు
- పరిష్కారం అంతంత మాత్రమేనన్న అభిప్రాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. ఈ కాలంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి సంధ్యారాణి కూడా వారి క్యాంపు కార్యాలయాల్లో ప్రజాదర్బార్లు నిర్వహిస్తునే ఉన్నారు. రాష్ట్రస్థాయిలో టిడిపి, జనసేన కూడా వారి రాష్ట్ర కార్యాలయాల్లో ప్రజాదర్బార్లు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రజాదర్బార్లకు జవాబుదారీతనం ఉందేమో తెలియదు కానీ స్థానిక నియోజకవర్గ కేంద్రాల్లో మంత్రి, ఎమ్మెల్యేలు చేపడుతున్న కార్యక్రమాలకు మాత్రం జవాబుదారీతనం కనిపించడం లేదు. గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటి వరకూ కనీసం 20 వరకు ప్రజాదర్బార్లు నిర్వహించి వుంటారు. అయితే ఏరోజు ఎన్ని సమస్యలకు సంబంధించి ఎన్ని వినతులు ప్రజల నుంచి అందాయో, ఎన్ని పరిష్కారమయ్యాయో ఇంతవరకు బహిర్గతం చేసిన దాఖలాల్లేవు. ఏఏ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపించామని చెప్పిన సందర్భాలు కూడా లేవు. ఈ కార్యక్రమం ప్రారంభించిన తొలినాళ్లలో కొద్దోగొప్పో జనాలు వినతులు అందజేయడానికి వచ్చారు. కాల క్రమేణా మంత్రి నిర్వహించిన ప్రజాదర్బార్లకూ ప్రజలు మొహం చాటేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక మంత్రి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్లకే స్పందన ఇలా వుంటే జిల్లాలో మిగిలిన ఎమ్మెల్యేలు నిర్వహించిన దర్బార్లకు ఆదరణ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కూడా అప్పుడప్పుడూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గడచిన ఏడాదిన్నర కాలంలో వీరు కూడా నిర్వహించిన ప్రజాదర్బార్ ల్లో ఎన్ని వినతులు అందాయో, ఎన్ని పరిష్కారమయ్యాయో ఇంతవరకు ప్రకటించిన దాఖలాల్లేవు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. మంత్రి, ఎమ్మెల్యేలకు వినతులు అందజేసినా అవి పరిష్కారానికి నోచుకోవడం లేదనే అభిప్రాయాన్ని జనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి లేదా ఎమ్మెల్యేలు నిర్వహించిన ప్రజాదర్బార్‌ల్లో ఇచ్చిన వినతులకు పరిష్కారం లభించిందని బాధిత ప్రజలు కూడా ఎక్కడా చెప్పిన సందర్భాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో అధికార కూటమి ఎమ్మెల్యేలు, మంత్రి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్లు కేవలం మొక్కుబడి కార్యక్రమాల మాదిరిగా నే కనిపిస్తున్నాయి.

ఇక ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్‌కే కుప్పలుతెప్పలుగా వినతులు అందుతున్నాయి. ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించి వినతులు ప్రతి వారం సుమారు 150కుపైగా జిల్లా కలెక్టర్‌తో సహ ఇతర అధికారులకు అందజేస్తున్నారు. అయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రాలు అందజేస్తే విధిగా రసీదు అందజేస్తున్నారు. బాధితులు ఇచ్చిన వినతులకు సంబంధించిన పరిష్కారం ఏ స్థాయిలో ఉందో ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తున్నారు. కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఇచ్చిన వినతులకు కూడా సత్వర పరిష్కారం దొరకకపోవడంతో బాధితులు పదేపదే వస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు జనం రాకపోకలు సాగిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి వినతులు అందజేస్తున్నా ఫలితం ఆశించిన స్థాయిలో లేదనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అయితే కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో అందజేసిన వినతులకు స్పష్టమైన జవాబుదారీతనం కనిపిస్తోంది. అదే మంత్రి, ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్లకు జవాబుదారీతనం కొరవడింది. మొక్కుబడి 'షో'ల మాదిరిగానే నిర్వహిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి (ఫైల్)

వాహన మిత్ర పథకాన్ని ప్రకటించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించక ముందే ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర పథకాన్ని ప్రకటించి, ప్రతి డ్రైవర్‌కు రూ.15 వేలు చెల్లించేలా నిర్ణయం చేయాలని ఆటో క్యాబ్ డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు, బోసు బొమ్మ, చిన్న బజారు, వేద సమాజం, నాయుడు వీధి, శివాజీ బొమ్మ గుండా బోసు బొమ్మ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ కార్మికుల ఉద్దేశించి ఆటో క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెడుతున్నప్పుడు దానివల్ల నష్టపోతున్న డ్రైవర్ల సంక్షేమం మరిచిపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ముందు హామీ ప్రకారం డ్రైవర్ల అందరికీ వాహన మిత్ర పథకం అమలుచేసి రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల మెడకు ఉరితాడులా ఉన్న జీవో 21ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలు, క్యాబ్‌ల కొనుగోలు కోసం ప్రస్తుతం డ్రైవర్లకు ఉన్న అప్పులు ప్రైవేట్ ఫైనాన్స్‌లు బ్యాంకు అప్పులు తీర్చడానికి వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. మ్యాక్సీ క్యాబ్‌ల చలానా విధానంలో ఎవరికి ఇబ్బందులు కలుగుతున్నాయని లైఫ్ టాక్స్ అమలు చేసి ప్రస్తుతం ఉన్న గ్రీన్ క్యాష్ ప్రధాన రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సంతు, గున్నం నాయుడు, జ్యోతిష్ కార్మికుల ఉద్దేశించి ప్రసంగించారు. శివాజీ బొమ్మ జంక్షన్ ఆటో స్టాండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అక్కా అప్పారావు, సాలూరు - మక్కువ జంక్షన్ల ఆటో యూనియన్ నాయకులు గొర్ల రమేష్, మజ్జి అప్పారావు, మామిడిపల్లి జంక్షన్ ఆటో యూనియన్ నాయకులు అంపోలు సంతోష్ కుమార్, పిన్నింటి కేశవ, శంబర ఆటో స్టాండ్ నాయకులు పూడి ప్రవీణ్, పూడి ఈశ్వరరావు, మామిడిపల్లి - సాలూరు ఆటో యూనియన్ నాయకులు జర్జాపు జోతిష్య, సోమేశు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.




పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఆటో, మాక్సీ, క్యాబ్ డ్రైవర్లు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి కొమరాడ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించడం సంతోషకర విషయం అని ప్రముఖ కవి రచయిత గంటేడ గౌర్నాయుడు అన్నారు. మండలంలోని దళిపేటలో గంటేడ చిన్నమ్మలు స్మారక ప్రతిభా పురస్కారం 2024- 25 కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గౌరునాయుడు మాస్టారు చేతులమీదుగా ఉత్తమ ర్యాంకర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులకు రూ.2వేలు నగదు ప్రోత్సాహకం, షీల్డ్, సర్టిఫికెట్లు, బట్టలు అందజేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు గంటేడ సోమేశ్వరరావు మాట్లాడుతూ చిన్నమ్మలు స్మారక ప్రతిభా పురస్కారం అవార్డులు ప్రతి ఏటా అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గంటేడ చిన్నమునాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న గంటేడ గౌరునాయుడు



మెటల్ తెలిపోయిన చిదిమి-పివిఆర్ పురం

వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి- పివిఆర్ పురం గ్రామాల మధ్య రహదారిపై 40 ఎంఎం చిప్స్ కుప్పలు తెప్పలుగా వేసేయడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇరు గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు సుమారు 300 మీటర్ల దూరంలో కొన్ని రోజుల కిందట కుప్పలు, కుప్పలుగా రాళ్లు వేసేయడంతో పొలం పనులకు ఆటంకంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని, స్థానికులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు మంజూరు చేయడంతో ఆదివారం పాలకొండలో ట్రాక్టర్ల విజయోత్సవ ర్యాలీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంత మొత్తంలో రైతుల ఖాతాలో నిధులు వేసే ఘనత కూటమి ప్రభుత్వందేనని అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, మండల టిడిపి అధ్యక్షులు గండి రామునాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు తదితరులు ఉన్నారు.




వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ నారాయణరావు

రహదారి భద్రతా నియమాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

రహదారి భద్రతా నియమాలను వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవగాహన ఉండాలని కురుపాం ఎస్సై పి.నారాయణరావు అన్నారు. ఆదివారం మూలిగూడ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టి ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలు పాటిస్తూ మద్యం సేవించకుండా అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రంథాలయానికి కంప్యూటర్ అందజేస్తున్న శివశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

డిజిటల్ గ్రంథాలయంగా మార్పు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా మార్చేందుకు అడుగులు వేస్తున్నామనిబెంగళూరుకు చెందిన శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్ డెల్ కంపెనీ వారి ఆర్థిక సహకారంతో ఆదివారం ఒక స్మార్ట్ టీవీ, స్మార్ట్ ఫోన్ బహూకరించారు. వీటిని ఫౌండేషన్‌కు చెందిన జిల్లా మాస్టర్ ట్రైనర్ కెవిపి వాగ్దేవి గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్నెట్ సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడడమే తమ సంస్థ ముఖ్యోద్దేశమన్నారు. త్వరలో ఈ కార్యక్రమం ద్వారా ఉచిత ఇంటర్నెట్ సేవలు కల్పించి తర్వాత శిక్షణ పీడియా అనే వెబ్ అప్లికేషన్‌తో పాటు, డిజిటల్ లిటరసీ, డిజిటల్ స్కిల్స్‌పైన ఉమ్మడి జిల్లాల్లో 50వేల మంది యువతీ యువకులు, వయోజనులు, విద్యార్థిని, విద్యార్థులకు, మహిళలు, స్వయం శక్తి సంఘాలు,నిరుద్యోగులకు డిజిటల్ సేవలను అందుబాటులో ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కల్వర్టు లేక ముంపునకు గురైన వరిచేలు

ప్రజాశక్తి - సీతానగరం

కల్వర్టు లేకపోవడంతో తమ వరిచేలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చినబోగిలి గ్రామానికి చెందిన రైతులు బరపరెడ్డి అప్పారావు, సత్యనారాయణకు చెందిన పొలాలు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నాయి. గతంలో ఈ పొలాల వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టు పాడైపోయింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు తమ వరిచేలు నీట మునిగాయని రైతులు ఆవేదం వ్యక్తం చేశారు. గతంలో ఉండే కల్వర్టు కూరుకుపోవడంతో వరద నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఆ నీరంతా పొలాల్లోనే నిలిచిపోతుంది. దీంతో పంటకు నష్టం వాటిల్లుతుంది. దీనిపై ఆర్అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతు బి అప్పారావు తెలిపారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి తమ పంటలను కాపాడాలని కోరుతున్నారు.



ముంపునకు గురైన వరిచేను

ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా

పట్టణ పరిస్థితి మామూలే

- చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయం
- పార్కింగ్ లేక తప్పని ట్రాఫిక్ కష్టాలు
- శాశ్వత పరిష్కారానికి పడని అడుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వాలు మారుతున్నాయి... అధికారులు మారుతున్నారు కానీ పట్టణం పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. సుమారు 22 ఏళ్ల క్రితం డివిజన్ కేంద్రంగా ఉన్న పట్టణంలోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్ల విస్తరణ ఆ తర్వాత పట్టణ పరిధితో పాటు బెలగాం శివారు వరకు అనూహ్యంగా వాణిజ్యపరంగా ఎంతోగానో అభివద్ధి చెందింది. ప్రధాన రహదారికి ఇరువైపులా ఆనుకుని బంగారం, రెడీమేడ్, డిపార్ట్మెంట్, ఫర్నిచర్, హార్డ్ వేర్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, హొటల్స్, సెల్ పాయింట్ లు, స్టేషనరీ, ఇతరత్రా షాపుల వాణిజ్య సముదాయాలు ఉండడంతో పాటు, ద్విచక్ర వాహనాల వాడకం, ఆటోలు ఎక్కువ కావడంతో ఇటు రాయగడ రోడ్డు శివారు నుండి బెలగాం శివారు ప్రాంతం దాటి వై కె ఎం కాలనీ వరకు, పాత బస్టాండ్, బంధం వారి వీధి రహదారుల నుంచి ఫ్లైఓవర్ మీదుగా ఉన్న కొత్తవలస శివారు వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల రహదారి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యతో రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా వాణిజ్యసముదాయాలను నిర్మించిన యజమానులు సెల్లార్ సౌకర్యం లేకుండానే బహుళ అంతస్తులు కట్టడం ఒక ఎత్తయితే, పట్టణంలో పార్కింగ్ స్థలాల్లేక తమ ద్విచక్ర వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ఎన్నికైన ఏ ఒక్క ప్రజా ప్రతినిధులు కానీ, అధికారులు కానీ కృషి చేయడంలేదు. ఈ సమస్యతో పాటు ముఖ్యంగా ఎన్నో ఏళ్లక్రితం పట్టణంలో నిర్మించిన మురుగు కాలువలు, ప్రధాన రహదారి కిరువైపులా ఉన్న కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో పట్టణ ప్రాంతంలో ఉన్న నివాస గృహాల వాడుక నీటితో పాటు, వర్షపు నీరు వెళ్లేందుకు ఏమాత్రం అవకాశం లేదు.



కుళాయిల ద్వారా వస్తున్న బురదనీరు



ఇటీవల కురిసిన వర్షానికి చెరువును తలపించిన మెయిన్‌రోడ్డు

దీంతో అడపాదడపా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే రహదారుల పైకి మురుగునీరు ప్రవహిస్తూ జలమయమవుతుంది. భారీ వర్షాలు కురిస్తే కొత్త ప్రాంతాలు, కాలనీలు నీట మునిగే పరిస్థితి ప్రతి ఏటా పునరావృతమవుతుంది. ప్రతి ఏటాకాలువల నిర్మాణానికి, కాలువలో ఉన్న పూడికతీతల పనులకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ మున్సిపల్ అధికారులు ఖర్చు చేస్తున్నప్పటికీ ఏ మాత్రం మార్పు కనబడడం లేదు. జిల్లా కేంద్రంగా అవతరించిన తర్వాత పట్టణంలో రహదారులు, ఉద్యానవనాలు, పార్కింగ్ స్థలాలు ఇతర అవసరాలకు అనుగుణంగా జనాభాకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత అధికారులకు ఎంతో ఉంది. కానీ జిల్లా ఏర్పడి మూడేళ్లయినా సౌకర్యాల కల్పనకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు అడుగులు వేయలేదని చెప్పవచ్చు.

అలాగే పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధ జలాల సరఫరాకు ప్రతి ఏటా లక్షలాది రూపాయలు నిధులను ఖర్చు చేస్తున్నప్పటికీ, పుష్కర కాలం దాటినా రంగు మారిన, కలుషిత తాగునీరు సరఫరా జరుగుతుండడం విశేషం. పట్టణంలో దీర్ఘకాలంగా నెలకొన్న ఈ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంలోనైనా అడుగులు ముందుకు పడాలని పట్టణ ప్రజల ఆకాంక్ష. ఈ సమస్యలు పరిష్కారం వైపు స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరి

అంగన్‌వాడీలపై దాడులకు పాల్పడుతున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - పాచిపెంట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను అణచివేసే ధోరణితో నిర్ణయాలు చేస్తున్నాయని, ఇందులో భాగంగా వివిధ రకాల దాడులకు పాల్పడుతున్నాయని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి విమర్శించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాచిపెంట ప్రాజెక్టు మహాసభ అధ్యక్షులు ఎల్.దాలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల కృషి ఫలితంగా మాతాశిశు మరణాలు, రక్తహీనత గణనీయంగా తగ్గిందని భవిష్యత్తు సమాజాన్ని నిర్మించే ఈశాఖకు మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో నిరంతరం అంగన్వాడీలపై ఒత్తిడి పెంచుతున్నారని, దీనివల్ల లక్ష్యానికి తగ్గట్టుగా పనిచేయడంలో ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. అంగన్వాడీలతో సంబంధం లేని పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు వెంటనే పూర్తి చేసి అర్హులైన వారికి వర్కర్లుగా నియామకాలు ఇవ్వాలని, లేకుంటే ఆందోళనకు వెళ్తామని హెచ్చరించారు. షరతులతో నిమిత్తం లేకుండా మినీ అంగన్‌వాడీలందర్నీ మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించి ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి కె.పార్వతీదేవి, సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం శ్రీను. అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు శశికళ, సెక్టార్ నాయకులు కె.సీత, వి.గౌరీశ్వరి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కమిటీ నూతన కమిటీ ఎన్నిక

అనంతరం పాచిపెంట ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. 20 మందితో కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష కార్యదర్శులుగా ఎల్.బాలమ్మ, పార్వతీదేవి, మరో 18 మంది కమిటీ సభ్యులు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఎండియు వాహనాల్లేక గిరిజనులకు అవస్థలు

వైసిపి ఎస్‌టి సెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక

ప్రజాశక్తి - సీతంపేట



గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎండియు వాహనాలు నెలకొల్పి ఇంటింటికీ బియ్యం, నిత్యవసర సరుకులు అందజేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ వాహనాలను ఎత్తివేయడంతో గిరిజనులకు కష్టాల మొదలయ్యాయని పాలకొండ నియోజకవర్గ వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీలో జిసిసి నిర్వహిస్తున్న ప్రతి డిఆర్ డిపోకు గిరిజన గ్రామాల నుంచి కనీసం ఐదు కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లి నిత్యవసర సరుకులు తెచ్చుకోవాల్సి పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పాటు ఒక రోజు పని పోతుందన్నారు. మండలంలోని పెదరామ డిపోకు వెళ్లి సరుకులు తీసుకోవాలంటే జగత్‌పల్లి, చాపరాయిగూడ, బంబడుగూడ, బూర్జు గూడ తదితర గ్రామస్తులు కనీసం ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అర్హులైన కొంతమందికి తల్లికి వందనం ఖాతాలో నగదు పడలేదన్నారు. అన్నదాత సుఖీభవ కూడా అందలేదని ఆరోపించారు. అర్హులైన వారికి పెన్షన్ అందలేదన్నారు. ఉచిత గ్యాస్ కొంతమందికి డబ్బులు పడలేదన్నారు. చాలా గ్రామాల్లో రహదారి సమస్య వెంటాడుతుందని ఆరోపించారు. ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

ప్రజాశక్తి - గజపతినగరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు దవలపల్లి మోహన్‌దాస్, దవలపల్లి శివరంజన్‌దాస్ అన్నదమ్ములు ఇద్దరు తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. తమ తండ్రి దవలపల్లి సీతారామయ్య, ఇతర కుటుంబ సభ్యులు జ్ఞాపకార్థం రూ.18 వేలు విలువ చేసే ఆరు సిమెంట్ బెంచీలు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్‌కు ఆదివారం అందజేశారు. ఈ బెంచీలను పాఠశాల ఆవరణంలోని మైదానం చుట్టూ ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణానికి మరింత అందం వచ్చింది. ఈ బెంచీల ఏర్పాటు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో దాత శివరంజన్ దాస్‌తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


తీవ్ర సంక్షోభంలో విద్య, వైద్యం

జెవివి రాష్ట్ర అధ్యక్షులు ఎం.గేయానంద్
వైభవంగా జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విద్య, వైద్య రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్ ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ, సాంస్కృతిక రంగాలు సైతం తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నాయని చెప్పారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభను జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు అధ్యక్షతన వైభవంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు శివానంద కుమార్, జెవివి జెండాను మరో గౌరవాధ్యక్షులు జె.నీలయ్య ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభలో గేయానంద్ ప్రసంగించారు. జాతీయంగా అమానవీయమైన సంఘటనలు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంచేశారు. అశాస్త్రీయంగా ఎవరు ప్రవర్తించినా సమాజానికి చేటేనని వ్యాఖ్యానించారు. వీటన్నింటిపై సెప్టెంబర్ 13, 14వ తేదిల్లో విజయనగరంలో జరిగే రాష్ట్ర మహాసభ చర్చించి.. భవిష్యత్తు కార్యాచరణకు నిర్దేశం చేస్తుందన్నారు. కళలకు కాణాచిగా నిలయంగా ఉన్న విజయనగరంలో రాష్ట్ర మహాసభ జరగడం మంచి పరిణామన్నారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట్రావు మాట్లాడుతూ సత్యాల సమాహారమైన సైన్స్‌ని మనం భుజాన్ని వేసుకుని, మంచి కోసం పని చేయాలన్నారు. శాస్త్రీయమైన భావజాలం సమాజానికి మేలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఒక చారిత్రాత్మకమైన సంఘటన అయిన 1994లో సారా ఉద్యమం చేపట్టిన రోజుల్లో విజయనగరం జిల్లాలో నాలుగో రాష్ట్ర మహాసభ నిర్వహించామని గుర్తుచేశారు. 18వ రాష్ట్ర మహాసభను విజయ



జెవివి మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

నగరం జిల్లాలో మరోసారి నిర్వహించనున్నామని చెప్పారు. జెవివి మరింత బలం పుంజుకోవడానికి ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.

జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, గోపాలరావు, గిరిధర్ మాట్లాడుతూ ఎన్నికలను అపహాస్యం చేసే విధంగా ఎన్నికల కమిషన్, కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. పార్లమెంటు ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకపోవడం వారి మూఢత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఎందరో ప్రాణత్యాగాలతో నిర్మించిన విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్థిక దోపిడీ విచ్చలవిడిగా జరుగుతోందని చెప్పారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, సమాజానికి నష్టాన్ని కలిగించే వాటి మీద మాత్రమే జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. జిల్లాలో ఉన్న 27 మండలాల్లో సైన్స్ ఉద్యమాన్ని విస్తరించాలన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ మాట్లాడుతూ తాత్విక ఆలోచన దిశగా జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. సమావేశంలో జెవివి ప్రధానకార్యదర్శి రమణ ప్రభాత్, సమతా విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జిల్లా యూత్ కన్వీనర్ చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా వెంకటరావు, రమణ ప్రభాత్

జనవిజ్ఞానవేదిక జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 34 మందితో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా గౌరవాధ్యక్షులుగా కె.శివానందకుమార్, జె.నీలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.మురళీబాబు, కోశాధికారిగా సిహెచ్.సింహాచలం ఎన్నికయ్యారు.

ఓండ్రుజోలలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఓండ్రుజోలలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ గిరిజన ఆచార, సాంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2002 నుంచి ఆర్ట్స్ సంస్థ ద్వారా ఆదివాసీ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఆదివాసీల సాంస్కృతి, సాంప్రదాయ పరిరక్షణకు ఆదివాసీ కాలచక్రం, ఆదివాసీ సవర జాతాపు సరాగాలు పుస్తకాల్లో ప్రచురించి వాటిని అనేక ఆదివాసీ పెద్దలతో ప్రచారం చేశామన్నారు. వ్యవసాయ విధానాలు, పంటలు, సంస్కృతి, పండగలు, వాటిలో ఉండే మూలాలను ఆదివాసీలు నైపుణ్యంతో వారు పనిచేయడం జరుగుతుందని అన్నారు. వీరికి సేవ చేయడం ఎంతో అదృష్టమని, అలాగే వారి దేవుళ్ల కొలిచే విధానం గానీ వాటిని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. అదేవిధంగా గిరిజన సంస్కృతిని, గొప్పతనాన్ని తెలుసుకోవాలని అన్నారు. అందుకోసం ప్రతి



ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు

ఒక్కరూ ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని, ఆర్ట్స్ సంస్థ ద్వారా రైతు ఉత్పత్తి కంపెనీ ఏర్పాటు చేసి వారి పండించిన పంటలకు మార్కెటింగ్, వస్తువ విలువ ఆధారిత శిక్షణ కార్యక్రమంలో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అలాగే వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించి ఉన్నత స్థితిలో తీసుకెళ్లి ఔత్సాహక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో ఆర్ట్స్ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. నీలకంఠాపురం, పాచిపెంట, కురుపాం మండలాల్లో ఆదివాసీతో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారిలో ఉండే ఆచారాల పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు సన్యాసిరావు తెలిపారు. అంతకు ముందు సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఓండ్రుజోల పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణలత, చంద్రరావు, కడగండి సర్పంచ్ రవి, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకర్రావు, కోఆర్డినేటర్ సందీప్, ఆర్ట్స్ సంస్థ సిఇఒ గౌతమి, ఆదివాసీ మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ, ఆర్ట్స్ ప్రతినిధులు గోవిందరావు, ప్రణీత, మహిళలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి చిరంజీవి

పరిధి దాటి వైద్యం చేయరాదు

ప్రజాశక్తి- పార్వతీపురం

గ్రామీణ వైద్యులు పరిధి దాటి వైద్యం చేయరాదని, ప్రభుత్వ నిబంధనలను అనుసరిం చాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ అధ్యక్షులు జంగం జోషి, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి అన్నారు. ఆర్ఎంపి, పిఎంపిలు పై జరుగుతున్న తనిఖీలపై మన్యం జిల్లాలో గ్రామీణ వైద్యులు ఐక్యవేదిక ఆదివారం స్థానిక పింఛనదారుల భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగీ, ఆబార్షన్ వంటి కార్యక్రమాలను ఆర్ఎంపిలు చేయరాదని చెప్పారు. తనిఖీలకు వచ్చే అధికారులతో సామరస్యంగా వ్యవహరిస్తూ వారిని గౌరవించాలని సూచించారు. 2009లో కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ పొంది ఉన్నవారు చాలామంది జిల్లాలో ఉన్నారని కొత్తవారుతో తెలిసి తెలియని వైద్యం చేయడం వల్ల ఒకరి తప్పు అందరిపై పడుతుందని దీనినీ నివారించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఐక్య వేదిక నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక పిఎంపి అధ్యక్షులు సింహాచలం, కార్యదర్శి ఎన్ గోపాలనాయుడు, పాలకొండ ఐఆర్ఎంపిడబ్ల్యు రామినాయుడు, సాలూరు ఇంచార్జ్ నరేష్, విజయనగరం జిల్లా అధ్యక్షులు కోట్ల పైడిరాజు, జిఎల్‌పురం గౌతం రవికుమార్, జిల్లాలో ఉండే సుమారు 200 మంది పైగా సభ్యులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన గనగల రామచంద్రుడు (28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రామచంద్రుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తు తాగుడికి బానిసై నిత్యం అదే పని మీద ఉండేవాడు. శనివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యను మద్యం తాగడానికి మరలా డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు లేవు ఇవ్వను నిత్యం ఇదేపని నీకు అని మందలించింది. దీంతో రామచంద్రుడు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కి ఉరేసుకున్నాడు. బయట అత్త మరదలతో మాట్లాడుతున్న భార్య శబ్దం విని ఇంటిలోపలకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కాలు చేతులు తన్నుకుంటూ కిందపడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న భర్తను విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి ఏడేళ్ల క్రితం అదే మండలం కొండరాజు పాలెం గ్రామానికి చెందిన ఎల్మాజితో పెళ్లయింది వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలంలోని పాత దుప్పాడ గ్రామంలో పాము కాటుకు గురై మహిళ ఆదివారం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పాత దుప్పాడ గ్రామానికి చెందిన టి.సత్యవతి (43) శనివారం సాయ ంత్రం పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం వన్ టౌన్ ఎస్ఐ దేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.